



కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఆలయం వద్ద క్యూలో బారులుదీరిన భక్తులు



పాతపట్నం : ప్రత్యేక అలంకరణలో నీలమణి దుర్గమ్మ



కోటబొమ్మాళి: దుర్గమ్మను దర్శించుకుంటున్న మంత్రి అచ్చెన్న



కోటబొమ్మాళి: కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

దుర్గమ్మా.. దీవించమ్మా..

- జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- ఆలయాలు, మండపాల్లో భక్తుల పూజలు

(శ్రీకాకుళం కల్చరల్/పాతపట్నం)

దసరాను పురస్కరించుకుని జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయాలు, మండపాలను సుందరంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో కొలువుదీర్చి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లోనూ మొక్కులు చెల్లించుకున్నారు. 'దుర్గమ్మా.. దీవించమ్మా' అని వేడుకున్నారు. శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో శ్రీ రాజరాజేశ్వరి, పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత, ముత్యాలమ్మ, నానుబాలవారి వీధిలోని విజయదుర్గ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అలాగే ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం.. పాతపట్నంలోని శ్రీనీలమణిదుర్గ ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు నీలమణి దుర్గమ్మ.. బాల త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇచ్ఛాపురంలో స్వేచ్ఛావతి అమ్మవారు.. శైలపుత్రిగా పూజలందుకున్నారు.



శ్రీకాకుళం: ఉమారుద్ర కోటేశ్వరాలయంలో రాజరాజేశ్వరి దేవి



శ్రీకాకుళం: సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



ఇచ్ఛాపురం: ప్రత్యేక అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు

అంబరాన.. కొత్తమ్మ సంబరం

- పోటెత్తిన భక్త జనసంద్రం

కోటబొమ్మాళి, అక్టోబరు 3: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి సంబరం.. అంబరాన్ని తాకింది. జాతరలో భాగంగా మంగళవారం నుంచి ఉత్సవాలు సందడిగా సాగాయి. చివరి రోజు గురువారం వేలాది సంఖ్యలో భక్తులు క్యూలో బారులుదీరి కొత్తమ్మను దర్శించుకున్నారు. చీర, ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక రెడ్డిక వీధిలోని చిన్న అప్పలనాయుడు ఇంటి నుంచి అమ్మవారి జంగిడిని పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య తీసుకువచ్చారు. మహిళలు పసుపు కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి దండకం చదివి పూజలు చేశారు. కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి వరకు రెండు కిలోమీటర్ల దారి పొడవునా భక్తజన సంద్రం కనిపించింది. ఉత్సవాల్లో భాగంగా పగటివేషాలు, కొయ్యి డ్యాన్స్‌లు భక్తులను అలరించాయి. గ్రామమంతా విద్యుత్ దీపాల అలంకరణ, జానపద, సాంఘీక నాటకాలు, పిల్లల వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు స్వచ్ఛందంగా భక్తులకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ప్రశాంతంగా.. టెట్ ప్రారంభం

నరసన్నపేట/ ఎచ్చెర్ల, అక్టోబరు 3: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రశాంతంగా ప్రారంభమైంది. జిల్లాలోని రెండు కేంద్రాల్లో గురువారం ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 200 మంది అభ్యర్థులకుగానూ 188మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 7 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. నరస న్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో 660 మంది అభ్యర్థులకు గానూ 527 మంది పరీక్ష రాశారు. నరసన్నపేట పరీక్షా కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను నరసన్నపేట, లావేరు, ఎచ్చెర్ల ఎంఈవోలు పర్యవేక్షించారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రం (చిలకపాలెం)లో ఈ నెల 6, 13, 20 తేదీల్లో టెట్ జరగనుంది.



నరసన్నపేటలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులకు తనిఖీ..

సంపన్న రాష్ట్ర సాధనకు.. భాగస్వామ్యం కావాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 3: స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను సంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఆర్థిక, సామాజిక, సాంకేతికంగా అభివృద్ధి చెందేందుకు తగిన సూచనలు, సలహాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్క్‌షాప్ నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. 'జిల్లాలో సుదీర్ఘంగా ఉన్న తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలి. జిల్లాలో పరిశ్రమలు స్థాపిస్తే టెక్నికల్ స్టాఫ్ అవసరం అవుతుంది. యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సులు, పాలిటెక్నిక్, ఐటీఐ చేసిన వారికి జిల్లాలోనే ఉపాధి కల్పించాలి' అని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేపట్టి అధిక దిగుబడులు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. సమావేశంలో ఎన్జీవో సంస్థలు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలియజేశారు. సమావేశంలో డీపీవో లక్ష్మీ ప్రసన్న, పరిశ్రమల అధికారి ఉమామహేశ్వరరావు, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు, ఉద్యానవనశాఖ అధికారి ప్రసాదరావు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, పట్టుపరిశ్రమ అధికారి రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇదేం దండన?



- విద్యార్థిని కర్రతో కొట్టిన ఉపాధ్యాయుడు
- కంటి మీద తగలడంతో తీవ్రగాయం
- కంటిచూపు కోల్పోయే ప్రమాదం
- పైడిభీమవరం పాఠశాలలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం

రణస్థలం, అక్టోబరు 3: కొంతమంది ఉపాధ్యాయుల తీరుతో విద్యార్థులు మూల్యం చెల్లించుకుంటున్నారు. కఠినంగా దండించడంతో ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఓ ఉపాధ్యాయుడు చేసిన పనికి.. విద్యార్థి కంటిచూపు పోయింది. ఈ ఘటన రణస్థలం మండలం పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగింది. ఈ విషయం బయటకు పొక్కకుండా ఉపాధ్యాయులు జాగ్రత్త పడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పసరపాలెం గ్రామానికి చెందిన చెన్నా అరుణ్‌కుమార్ అనే విద్యార్థి ఈ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 1న పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు దండించే క్రమంలో చేతిలో ఉన్న కర్రతో ఆ విద్యార్థిని కొట్టాడు. ఆ కర్ర పొరపాటున కంటి మీద తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కన్ను ఎర్రగా మారడంతో మరో ఉపాధ్యాయుడు పైడిభీమవరంలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు.. బాధిత విద్యార్థి తండ్రిని స్కూల్‌కి రప్పించి జరిగిన విషయం చెప్పాడు. రూ.1000 అందజేసి.. వైద్యం చేయించుకోవాలని సూచించాడు. కంటి బాధతో విలవిల్లాడుతున్న విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం మాత్రం చేయలేదు. నిరుపేదలైన తల్లిదండ్రు లు.. మరుసటి రోజు ఆ విద్యార్థిని విజయనగరంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే కన్ను బాగా దెబ్బతిందని చెప్పిన వైద్యులు.. విశాఖలోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తెచ్చి ఉంటే కన్ను బాగుచేసి ఉండే వారమని.. ఇప్పుడు ఆపరేషన్ చేసినా గ్యారంటీ లేదని చెప్పడంతో వారు ఆందోళన చెందుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో కనీసం వైద్య ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నామని కన్నీరుమున్నీరవుతున్నారు.



కంటి గాయంతో బాధపడుతున్న అరుణ్‌కుమార్

వరుస ఘటనలు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటీవల రణస్థలం మండలం పాతర్లపల్లిలో పాఠశాల తరగతుల సమయంలో భవనం సన్‌షేడ్ పై నుంచి జారిపడి కృష్ణంరాజు అనే విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. అప్పట్లో కూడా ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఘటన జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలించడంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేసినట్టు ఆరోపణలు న్నాయి. చివరకి తోటి విద్యార్థులే చెక్క బల్లపై ఆస్పత్రికి తీసుకెళ్లడం, అప్పటికే ఆలస్యమై విద్యార్థి చనిపోవడం ఆందోళనకు దారితీసింది. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తూ ఆందోళన చేశారు. తాజాగా పైడిభీమవరంలో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పొరపాటున ఈ ఘటన జరిగినా.. వెంటనే ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి అని బాధితుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై దళిత సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సంబంధిత ఉపాధ్యాయుడిపై చర్యలకు డిమాండ్ చేస్తున్నాయి.

మెరుగైన వైద్యం కోసం..

విద్యార్థులు అల్లరి చేసే క్రమంలో నియంత్రించడానికి ఉపాధ్యాయుడు ప్రయత్నించారు. ఈ క్రమంలో చేతిలో ఉన్న కర్రకు సంబంధించి చిన్నపాటి ముక్క విద్యార్థి కన్నుకు గుచ్చుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్పందించాం. స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక వైద్యం అందించాం. ఇది పొరపాటున జరిగింది. ప్రస్తుతం బాధిత విద్యార్థి వెంట ఆసుపత్రిలోనే ఉపాధ్యాయులమంతా ఉన్నాం. మెరుగైన వైద్యం అందించే ప్రయత్నం చేస్తున్నాం.

-టి.శోభారాణి, ప్రధానోపాధ్యాయురాలు,
పైడిభీమవరం హైస్కూల్

రైతులు కోరుకున్నట్టే!

- మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన నడిమింటి శ్రీరాములు అనే రైతుకు.. ధాన్యం విక్రయాలకు సంబంధించి గతేడాది నరసన్నపేటలోని మిల్లుకు షెడ్యూల్ వచ్చింది. దీంతో సుమారు 40 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆ మిల్లుకు ట్రాక్టర్ ద్వారా ధాన్యం తరలించారు. తీరా అక్కడకు వెళ్లగా.. ధాన్యం ముక్కపాయి అంటూ.. బస్తాకు 4కేజీలు అదనంగా ఇస్తేనే అన్‌లోడ్ చేయిస్తామని మిల్లు యజమాని తెలిపారు. అంతదూరం నుంచి మళ్లీలోడ్‌తో వెనక్కిరాలేక.. బస్తాకు 4 కిలోలు అదనంగా ధాన్యం ఇచ్చి అన్‌లోడ్ చేయించారు.

....

- మెళియాపుట్టి మండలం బందపల్లి గ్రామానికి చెందిన కాలారి గంగారావు అనే రైతుకు గతేడాది ధాన్యం విక్రయాలకు గొప్పిలి మిల్లును కేటాయించారు. బందపల్లి నుంచి గొప్పిలికి 50 కిలోమీటర్లకుపైగా దూరం. దీంతో గంగారావు నానా ఇబ్బందులు పడి ధాన్యాన్ని మిల్లుకు తరలించారు.

- మిల్లు ఎంపిక నిర్ణయం వారిదే!
- ధాన్యం కొనుగోలులో సంస్కరణలు

(మెళియాపుట్టి)

వైసీపీ పాలనలో రైతులు.. తాము పండించిన ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు పడ్డారు. సుదూర ప్రాంతాల్లో మిల్లులు కేటాయించడంతో ధాన్యాన్ని తరలించేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు. తరుగు, పొల్లు పేరిట మిల్లర్లు అదనపు దోపిడీ చేయడంతో మరింత నష్టపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సంస్కరణలకు సన్నద్ధమవుతోంది. రైతులకు ఇబ్బందులు లేకుండా.. వారు కోరుకున్న మిల్లులోనే ధాన్యం విక్రయించేలా చర్యలు చేపడుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఈ ఏడాది 4.37 లక్షల ఎకరాల్లో వరి పండిస్తున్నట్టు అధికారుల అంచనా. గతేడాది 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మరో నెలరోజుల తర్వాత పంట దిగుబడి అంచనా వేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 205 మిల్లుల ద్వారా ధాన్యం సేకరణకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసేలా.. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్.. అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో ట్రాక్టర్లకు జియోట్యాగింగ్ పరికరాలు అమర్చి.. మిల్లులకు ధాన్యం తరలించారు. కానీ కొంతమంది రైతులకు ధాన్యం డబ్బులు జమకాకపోవడంతో ఆందోళన చెందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతుల ఖాతాల్లో బకాయిలు జమచేశారు. తాజాగా తాము కోరుకున్న మిల్లుకే ధాన్యం తరలించే వెసులుబాటు కూడా కల్పించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యం సేకరణ (ఫైల్)

బదిలీ అయి.. విధుల్లో చేరేందుకు వెళుతూ..

- ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు గుండెపోటు
- పాతపట్నం సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి

నరసన్నపేట, అక్టోబరు 3: నరసన్నపేటలో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తూ..పాతపట్నం బదిలీ అయి విధుల్లోకి చేరేందుకు వెళ్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ జలుమూరు మోహనరావు(33) గుండెపోటుతో మృతిచెందిన ఘటన అందరినీ కలిచివేసింది. ఎక్సైజ్ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల బదిలీల్లో భాగంగా ఎక్సైజ్ కానిస్టేబుల్ మోహనరావుకు నరసన్నపేట నుంచి పాతపట్నం స్థానచలనం చేశారు. కొన్నిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన గురువారం రిలీవ్ ఆర్డర్ తీసుకున్నారు. అనంతరం విధుల్లో చేరేందుకు ఆర్టీసీ బస్సులో పయనమయ్యారు. సారవకోట మండలం దాటుతున్న సమయంలో మోహనరావు అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలో జ్వర తీవ్రత అధికంగా ఉందని గమనించి తోటి ప్రయాణికులు సపర్యలు చేశారు. అనంతరం పాతపట్నం సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అయితే మోహనరావుకు గుండెపోటు వచ్చినట్లు ఆసుపత్రి వైద్యుడు షన్ముఖరావు నిర్ధారించారు. మృతుడికి భార్య మోహిని, కుమార్తె పరిణిక ఉన్నారు. వీరు నరసన్నపేటలో కోవెలవీధిలో నివాసం ఉంటున్నారు. ఈయన స్వగ్రామం ఎచ్చెర్ల. మోహనరావు మృతిపై ఎక్సైజ్ సీఐ రమణ, ఎస్ఐ గురుమూర్తి, సిబ్బంది సంతాపం తెలిపారు.



మోహనరావు (ఫైల్)

రైల్వే సామగ్రి చోరీ.. సచివాలయ ఉద్యోగిపై కేసు

ఆమదాలవలస: రైల్వేస్టేషన్ పరిధిలో జరిగిన రైల్వే సామగ్రి చోరీ కేసులో ఓ గ్రామ సచివాలయ ఉద్యోగిపై కేసు నమోదైంది. స్థానిక రైల్వేస్టేషన్ ఆర్‌పీఎఫ్ ఓసీ మనోజ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం రోడ్డు-తిలారు రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే కమ్మీలు, ఇతర రైల్వే సామాగ్రి చోరీకి గురయ్యాయి. దీనిపై నిఘా పెట్టిన ఆర్‌పీఎఫ్ పోలీసులు.. కోటబొమ్మాళి మండలం కిష్టప్పపేట గ్రామ సచివాలయ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న మేదర మహేంద్ర అనే వ్యక్తి చోరీ చేసిన సామగ్రిని సారవకోటలో విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు లేకుండా చేయాలని గత రెండు రోజులుగా రాజకీయ నాయకుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్నట్టు తెలుస్తుంది.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

శ్రీకాకుళం క్రైం: ఇటీవల ఎనభై అడుగుల రహదారిలోని ఓ కల్యాణ మండపంలో పనిచేస్తున్న మేనేజర్ ధనుంజయరావుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని హోటల్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్ట నాగరాజు ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు ఎస్పీతో మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు కెల్ల కిషోర్, నక్క రామరాజు, బాధితుడు ధనుంజయరావు తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

అరసవల్లి: శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యల పరిష్కారానికి శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వేదికగా ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. ప్రజల నుంచి నేరుగా ఎమ్మెల్యే సమస్యలపై వినతులను స్వీకరిస్తారు. ఇందుకు గాను డివిజన్ల వారీగా షెడ్యూల్‌ను రూపొందించామని, వ్యక్తిగత, సామాజిక సమస్యలను ప్రజా దర్బార్‌లో తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నగర పరిధిలోని అన్ని విభాగాలకు సంబంధించిన సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. సుందర శ్రీకాకుళం నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు వినతులను స్వీకరించనున్నట్టు తెలిపారు. నగరవాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ పిలుపునిచ్చారు.

'తమ్మినేని' అక్రమాలతో మున్సిపాలిటీకి కష్టాలు: కూన

సరుబుజ్జిలి: మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన తనయుడి అక్రమాలతో మున్సిపాలిటీ ప్రజలకు కష్టాలు అధికమయ్యాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. గురువారం ఆలమాజీపేట గ్రామం వద్ద మున్సిపాలిటీకి తాగునీరు అందిస్తున్న వంశధార నది పరివాహక ప్రాంతంలో ఉన్న పంపు హౌస్‌లను ఆయన పరిశీలించారు. తాగునీటి గూర్చి ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంకులు, మోటారు పైపు లైన్లు ఎమ్మెల్యే పరిశీలించి కమిషనర్ బాలజీ ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. పలు వార్డుల్లో బురదనీరు రావడం తన దృష్టికి వచ్చిందన్నారు. మోటార్లు ఇటీవల మరమ్మతులకు గురై మూలకు చేరితే వాటిని మరమ్మతులు చేయడానికి మున్సిపాలిటీలో డబ్బులు లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తమ్మినేని అక్రమ కలెక్షన్లతో మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలతో ఆదాయం లేని మున్సిపాలిటీగా మారడం వల్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. టీడీపీ నాయకులు కిల్లి శేషు, మోహన్, అప్పలనాయుడు, కేవీ సత్యనారాయణ, లక్ష్మి, గోవిందరావు, అధికారులు ఉన్నారు.

సాంకేతికతను ఉపయోగించాలి


మాట్లాడుతున్న సాయిసందీప్

ఎచ్చెర్ల: తాము నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగించాలని సంబంధిత నిపుణులు, పోలీసు అధికారులు అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో సైబర్ ప్రో-లాక్ పేరిట వర్సిటీ ఈసీఈ విభాగం, సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకడమిక్ రీసెర్చ్ సెల్ (స్పార్క్) ఫౌండేషన్ సంయుక్తంగా గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పార్క్ ఫౌండేషన్ ఛైర్మన్, సైబర్ అనలిస్ట్ ఎస్.సాయిసందీప్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్, డిజిటల్ దాడులు ఎక్కువయ్యాయన్నారు. వీటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. సాంకేతిక వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం మాట్లాడుతూ.. విద్యార్థులు ఫోనోగ్రఫీ, సెర్చింగ్, ర్యాగింగ్, డ్రగ్స్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో పారిశుధ్య పనులు

సరుబుజ్జిలి: రొట్టవలస గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు తాడేలా రాజారావు తన సొంత నిధులతో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మెయిన్‌వీధి, నాయుడు వీధిలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు భారీగా వ్యాప్తి చెంది డ్రైనేజీలు పూర్తిస్థాయిలో మూసుకుపోవడంతో వర్షం పడితే పారిశుధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించకపోవడంతో తన సొంత నిధులతో జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలను తొలగించి డ్రైనేజీలో పూడికతీత పనులు చేయించారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి పారిశుధ్య పనులు పారిశుధ్య పనులు చేయాలని రాజారావు కోరారు.

ఎస్పీని కలిసిన ఉప రవాణా కమిషనర్


ఎస్పీతో రవాణా శాఖ డీసీ

శ్రీకాకుళం క్రైం: జిల్లా ఉప రవాణా (డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్)కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎ.విజయసారధి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

గ్రామసభ చట్టబద్ధమైనదే

ఆమదాలవలస: గ్రామసభకు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించినట్టు వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం స్థానిక కొర్లకోట పంచాయతీలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 243 (ఎ) ప్రకారం రాష్ట్ర శాసనసభల ద్వారా కొన్నిచట్టబద్ధమైన అధికారాలు, విధులను గ్రామసభకు కల్పించారన్నారు.

సొంత నిధులతో రహదారి మరమ్మతులు

జి.సిగడాం: పెనసాం గ్రామంనుంచి గంగన్నదొర పాలెంకు వెళ్లే రహదారి మరమ్మతు పనులను గురువారం పెనసాం గ్రామానికి చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కుదిరిళ్ల అప్పారావు(బుజ్జి) రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. శేతుభీమవరం గ్రామ పంచాయతీ హేమలేట్ విలేజ్ రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దీంతో బుజ్జి తన సొంత నిధులు రహదారి పనుల చేపించారు.

చర్యలు తప్పవు

రణస్థలం: అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని రణస్థలం ఎక్సైజ్ సీఐ అనూరాధదేవి అన్నారు. ఇటీవల రణస్థలం ఎక్సైజ్ సీఐగా ఆమె బాధ్యతలు చేపట్టారు. బెల్ట్‌షాపులు నిర్వహించిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న ఏసీ కృష్ణమోహన్

అరసవల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లక్ష్యమని ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురువారం ఆయన ప్రారంభించారు. జడ్పీ సీఈవో వెంకటరామన్, డీపీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కంచిలి: రైలు నిలయం వద్ద ఎమ్మెల్యే అశోక్..


రణస్థలం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్..


నందిగాం: నీలమణిదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


బూర్జ: పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడవాడలా శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో వివిధ గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పందిళ్లను ఏర్పాటు చేసి అమ్మవార్లను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దీక్షలు చేపట్టి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం నుంచి విజయ దశమి పర్వదినం వరకు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించడంతో కళకళలాడుతున్నాయి.

\- ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: దీపారాధనలో పాల్గొన్న భక్తులు


శ్రీకాకుళం కల్చరల్: డే అండ్ నైట్ కూడలిలోని ట్యాక్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి తిరువీధి


శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో తుల్జాభవాని..


ఇచ్ఛాపురం: 2008 చామంతి పూలతో మహాలక్ష్మి దేవికి పుష్పాభిషేకం


గార: బూరవెల్లిలో వైష్ణవీ దుర్గా ఆలయంలో..


జి.సిగడాం: పెంట గ్రామంలో..


సరుబుజ్జిలి: కొత్తకోటలో..


ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో..


పొందూరు: రాపాకలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు


సంతబొమ్మాళి: బోరుభద్రలో దుర్గామాతకు పూజలు


పలాస: లేబర్ కాలనీలో..


నరసన్నపేట: కొలువుదీరిన దుర్గమ్మ


వజ్రపుకొత్తూరు: డోకులపాడులో పాల్గొన్న భక్తులు


ఇచ్ఛాపురం: ఈదుపురం గ్రామంలో..


హిరమండలం: సుబలయ గ్రామంలో..


జలుమూరు: శ్రీముఖలింగంలో వారాహి అమ్మవారి సన్నిధిలో..


పలాస రూరల్: బొడ్డపాడులో..


టెక్కలి: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అష్టాదశ శక్తిపీఠ అమ్మవార్లు

కల్తీ నెయ్యి వినియోగం వాస్తవం

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్


విలేకరులతో మాట్లాడుతున్న చింతామోహన్

శ్రీకాకుళం అర్బన్: తిరుమల లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యిలో కల్తీ జరిగిన మాట వాస్తవమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ వ్యాఖ్యానించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన గురువారం ఓ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. 'తిరుమల లడ్డూలో అందరూ అనుకుంటున్నట్లుగా గొడ్డు, పంది, చేపల వంటి వాటితో కల్తీ జరగలేదు. కానీ లడ్డూకు వాడే నెయ్యిలో నూనె, పామాయిల్ కల్తీ జరిగిన మాట వాస్తవం. లడ్డూ విషయం రాజకీయాల్లోకి వచ్చింది. అంతేకాదు సుప్రీంకోర్టుకు కూడా వెళ్లింది. వైసీపీ హయాంలో ధర్మకర్తల మండలి కాంట్రాక్టులు, దర్శనాల విషయాల్లో అవినీతికి పాల్పడ్డారు. రూ.500 టిక్కెట్టును రూ.5వేలకు అమ్ముకున్నారు. వాళ్లకు నచ్చిన కాంట్రాక్టర్లకు, ట్రేడర్లకు పనులు అప్పగించి ముడుపులు అందుకున్నారు. బయట మార్కెట్‌లో నాణ్యమైన నెయ్యి రూ.750 ధర పలుకుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ ధర్మకర్తల మండలి ట్రేడర్లు రూ.320 నెయ్యి సరఫరా అయ్యేలా చేశారు. లాభాల కోసం నెయ్యిలో వంట నూనె కల్తీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీకే పరిమితమయ్యారు. పోలవరం ప్రాజెక్టు అనేది పొలిటికల్ లీడర్లకు, కాంట్రాక్టర్లుకు మాత్రమే వరంగా మారింది. ఆ ప్రాజెక్టే అంతర్జాతీయ స్కాం. ప్రతి ఇంటికీ పాడి ఆవులను ఇచ్చి తద్వారా స్వయం ఉపాధి కల్పించడంతోపాటు నాణ్యమైన నెయ్యిని టీటీడీకి అందించవచ్చు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచన చేయాలి. జిల్లా అభివృద్ధి ఇక్కడి ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదు. సూపర్-6 పథకాలు అమలులో చంద్రబాబు మాట తప్పారని' చింతామోహన్ అన్నారు. కాగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో విభేదాలపై, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిపై వినిపిస్తున్న విమర్శలపై విలేఖరులు ప్రశ్నించగా ఆయన మాటదాట వేశారు. పార్టీ నాయకులు బసవ షన్ముఖ రావు, లఖినేని సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు డొంకూరు విద్యార్థులు

ఇచ్ఛాపురం: రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం జె.సరోజిని తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. గత నెల శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో వీరు ప్రతిభ చూపారు. అండర్-14 విభాగంలో బి.భరత్ చంద్ర, టి.వినీత, అండర్-16 విభాగంలో టి.అన్విత, అండర్-18 విభాగంలో డి.అమృత ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ఏపీజీవీబీ సేవలు బాగున్నాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు అద్భుతంగా ఉన్నాయని, జిల్లాలో 90కి పైగా బ్రాంచీలు కలిగిన ఏకైక సంస్థ అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే బ్యాంకును జాతీయ రూరల్ బ్యాంకుగా చేయాలనే ప్రతిపాదన మంచిదేనన్నారు. బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్, ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు సంయుక్తంగా నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఆర్చరీ క్రీడాకారులను అభినందించిన కలెక్టర్


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్, జేసీ

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ మహ్మద్ అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లో క్రీడాకారులతోపాటు శిక్షకులు ఎస్.శ్రీనివాసరావు, ఎ.మధుసూధనరావు, ఈశ్వర ప్రసాద్ గురువారం కలెక్టర్‌ను కలుసుకున్నారు. అండర్-14 బాలికల విభాగంలో జి.లక్ష్మి తన్విక, ఒడిసి మేఘన, బాలురలో పి.లోకేష్, కొయ్యాన నీల మనోహర్ నాయుడు, సాయి సాహిత్, చేతన స్వరూప్, ఎ.కల్యాణ్, ఎన్ .జనిత్, అండర్-17 విభాగంలో జి.తనిషా చౌదరి, యు.సాజిత్, పి.త్రివేణి, బి.శ్రీప్రియ, యు.మోక్షశ్రీ ఎంపికయ్యారు.

క్రీడల్లో మరింత భాగస్వామ్యం కావాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ తరఫున విద్యార్థులు క్రీడల్లో మరింత భాగస్వామ్యం కావాలని వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో గురువారం స్పోర్ట్స్ బోర్డు వార్షిక సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై చర్చించారు. రిజిస్ట్రార్ పి.సుజాత, స్పోర్ట్స్ డీన్ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు. కాగా ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవా చేపట్టారు.

డ్రైనేజీ ఆక్రమణలు తొలగించండి


అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పట్టణంలోని పారిశుధ్య నిర్వహణ పనుల్లో డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణల షాపులను తొలగించాలని ఎమ్మెల్యే రవికుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో ఆయన పర్యటించి పలు సూచనలు చేశారు. శ్రీరామవరస పంచాయతలో బయోగ్యాస్ ప్లాంట్ ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. డ్రైనేజీలపై షాపులు ఏర్పాటు వల్ల పారిశుధ్య పనులకు ఇబ్బంది ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, టీడీపీ నాయకులు కూన అంజనేయులు, సంపతిరావు మురళీధర రావు, నాగళ్ల మురళీధర్, తంగి గురయ్య, విజయ్‌కుమార్ ఉన్నారు.

వారం రోజుల్లోనే..

● విరిగిన కాలువపై పలకలు

● నాసిరకం పనులపై విమర్శలు


పాడైన పలకలు

ఇచ్ఛాపురం: పురపాలక సంఘ పరిధి సురంగిరాజా మైదానం సమీపం బెల్లుపడ రోడ్‌లో వారం రోజుల కిందటే రూ.లక్షలు వెచ్చించి కాలువపై గురువారం పలకలు విరిగిపోయాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు భయపడుతన్నారు. నాశిరకం పనుల వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు మండిపడుతున్నారు. అలాగే కాలువల్లో షిల్ట్ తొలగిస్తామని విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సురంగిరాజా మైదానం వరకు కాలువలపై గల పలకలు తొలగించి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కాగా ఈ సమస్యపై ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో చర్చించినా అధికారులు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

స్టాక్ పాయింట్ నుంచే ఇసుక


చలానా తీసుకుంటున్న తహసీల్దార్

గార: మండల కేంద్రంలో వంశధార నది వద్ద ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ నుంచి గురువారం ఉదయం అధికారులు ఇసుక డెలివరీ ప్రారంభించారు. ముందుగా ఆన్‌లైన్‌లో చలానాలు తీసుకున్నవారికి అధికారులు ఇసుక తీసుకువెళ్లడానికి అనుమతి ఇచ్చారు. తహసీల్దార్ ఎస్.రమణరావు, మైనింగ్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ కార్యవర్గం

అరసవల్లి: జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జె.కేశవరావు, బి.అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని జిల్లాలోని అయా పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా సీహెచ్ విజయకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్.లూసీ ఎస్టర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేష్, ఉపాధ్యక్షులుగా రాజేష్, మాధవీ రాణి, అరుణకుమారి, జగదీష్, జి.వెంకటరమణ, విజయ్ ఎంపికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోంపేట: కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో బారువ, గొల్లగండి, సీహెచ్ గొల్లగండి పరిసర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పలాస ఈఈ జి.యోగేశ్వరరావు తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **ఇచ్ఛాపురం:** మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పలాస ఈఈ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం డొంకూరు, బూర్జపాడు, తిప్పనపుట్టుగ, సన్యాసిపుట్టుగ పంచాయితీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

● **ఎచ్చెర్ల:** ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపునకు, మరమ్మతుల కోసం ఈ నెల 4న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈఈ పి.యోగీశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫరీద్‌పేట, కుశాలపురం, ఎస్ఎం పురం, లింగాలపేట, కేశవరావుపేట, రాజీవ్‌నగర్ కాలనీలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీడీవోగా తిరుమలరావు

కంచిలి: ఎంపీడీవోగా వి.తిరుమలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మందస మండల ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై కంచిలి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో నీరజ కొత్తూరు మండలం బదిలీపై వెళ్లారు.

● **సరుబుజ్జిలి:** మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ఎం.పావని గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన పీవీ మురళీమోహన్‌కుమార్ సారవకోట ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. కొత్తూరు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న పావని ఇక్కడికి వచ్చారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బస్‌పాసులకు కొత్త వెబ్‌సైట్

అరసవల్లి: ఈ విద్యా సంవత్సరంలో స్టూడెంట్ బస్ పాసులకు కోసం కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో మంత్లీ, సీజనల్ టిక్కెట్‌లపై తిరిగే ప్రయాణికులకు పాసుల మంజూరు మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్ అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ వెబ్‌సైట్ ఈ నెల 7వ తేదీ నుంచి పనిచేస్తుందని తెలిపారు.

న్యాయం చేయండి

అరసవల్లి: సహారా బాధితులకు డిపాజిట్ సొమ్మును చెల్లించాలని, వారికి న్యాయం చేయాలని సహారా కస్టమర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బోయిన సత్యనారాయణ, బైపల్లి సత్యరాజు, కేవీ ప్రసాదరావు అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం ఖాతాదార్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

బాధితులకు పరామర్శ

ఆమదాలవలస: స్థానిక మెట్టక్కివలసకు చెందిన పొన్నాడ రామారావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం ఆయన నివాసంలో పరామర్శించారు. అదేవిధంగా వైసీపీ నాయకుడు తాతపూడి శ్రీను తల్లి ఇటీవల మరణించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వైసీపీ నాయకులు ఉన్నారు.

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు

ఆమదాలవలస: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని తొగారం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం అన్నారు. గురువారం చివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఉపాధి పథకం ద్వారా గ్రామంలో చేయాల్సిన పనులను గుర్తించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంకా జగన్ సేవలోనే..

● ఫిర్యాదు చేసినా లోగోలు తొలగించని అధికారులు



జలుమూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా ఇంకా కొన్ని గ్రామ సచివాలయాలపై మాజీ సీఎం బొమ్మలు, నవరత్నాల లోగోలు కనిపిస్తున్నాయి. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా జోనంకి గ్రామ సచివాలయం నిలుస్తోంది. ఇంకా సచివాలయ అధికారులు జగన్ సేవలో తరిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకుడు జి.ప్రసాదరావు తదితరులు పేర్కొంటున్నారు. దీనిపై ఎంపీడీవో కె.అప్పలనాయుడును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, సీఈవోతో మాట్లాడి జగన్ ఫొటోలు, లోగోలు తొలగిస్తామన్నారు.

5, 6 తేదీల్లో బస్ పాస్‌ల జారీ ఉండదు

టెక్కలి: ఏపీఎస్‌ఆర్టీసీ పరిధిలో విద్యార్థులకు బస్‌పాస్‌ల జారీకి ఈనెల 5, 6 తేదీల్లో (శని, ఆదివారాలు) అంతరాయం కలుగుతుందని డిపో మేనేజర్ ఎస్‌.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్ పాస్‌లు జారీ చేసే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడేషన్ చేపడుతున్నందున సదరు కౌంటర్లు తెరవరని, ఈ విష యాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. సోమవారం నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్లు పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

టెక్కలి: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం కళాశాలలో 'బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్'లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకునే దశలోనే కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధి అప్పారావు మాట్లాడుతూ.. ప్రేరణ మిత్ర యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో సమన్వయకర్త అజయ్‌కుమార్, ఐక్యూ కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, డాక్టర్ లీలాపద్మజ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 4, 5 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

టెక్కలి: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబరు 4, 5 తేదీల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, ఎన్ఐటీ (రూర్కెలా) సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ అండ్ ఇంటలిజెంట్ మేనఫేక్చరింగ్ సిస్టమ్' అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కన్వీనర్ రమేష్, డీన్‌లు సీహెచ్.రమేష్, యూడీ ప్రసన్న, శ్రీరాములు, కో-ఆర్డినేటర్ మాదిన జయంతిరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

నరసన్నపేట: మేజర్‌పంచాయతీలో పారిశుధ్య మెరుగుపరచాలని పలువురు సభ్యులు, ప్రజలు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం గాంధీ మండపం వద్ద గురువారం సర్పంచ్ శంకరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అర్హులైన వారికి పింఛన్లు అందజేయాలని కోరారు. ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణ మాట్లాడుతూ.. 2019-14 మధ్య నిర్మించిన ఎన్టీఆర్ గృహాలు నిర్మించుకున్న వారికి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఈవో ద్రాక్షాయిణి, మాజీ ఎంపీటీసీలు పీస కృష్ణ, జామి వెంకట్రావు పాల్గొన్నారు.

ఓంద్రుజోలలో గ్రామసభ

కొత్తూరు: ఓంద్రుజోల పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధి ఏపీడీ రాధ, ఏపీవో ప్రేమలత ఈ గ్రామసభలో పాల్గొన్నారు. కొత్త పనుల గుర్తింపు, ప్రభుత్వం ఇచ్చిన మొక్కలు పొలాల్లో నాటి వాటి పెంపకం చేపట్టాలని తీర్మానించారు. ఒకే పంటపై రైతులు ఆధారపడకుండా నాలుగు, ఐదు రకాల మొక్కలను పెంచడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కొండ పట్టాలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంధ వరపు ఈశ్వరి, ప్రతినిధి నాగేంద్ర, మాజీ ఎంపీటీసీ నిమ్మగడ్డ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి డిల్లేశ్వరరావు, ఉపాధి వేతనదారులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

పొందూరు: పంచాయతీల పరిధిలో సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని మేజరు పంచాయతీ సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఈవో మోహన్‌బాబు అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రామ్మోహన్, బి.గిరి, డి.మురళి, డి.రవి, ఎ.గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఆప్టోమెట్రీపై అంతర్జాతీయ వెబినార్



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కుమారస్వామి

నెల్లిమర్ల: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఆప్టోమెట్రీ విభాగంలో పరిశోధన, అభివృద్ధి అనే అంశంపై అంతర్జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమెరికాలోని ఆపిల్ విజన్ సైంటిస్ట్ డాక్టర్ దిబ్యేందుపస్తి హాజరై ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా స్వామి కంటి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కుమార స్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ విజయ్‌బాబు, ఆప్టోమెట్రీ విభాగాధిపతి సౌరజిత్ కుమార్ బెనర్జీ, ఐక్యూ ఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, అధ్యాపకులు శ్రావణి మేరెడ్డి, దినేష్ కుమార్ నాగుల శ్యామల, అలన తేజ, పి.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన కళాకారుడికి సాయం

హరిపురం: లోహరిబంద గ్రామానికి చెందిన కీబోర్డు కళాకారుడు చక్రి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై శ్రీకాకుళం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురానికి చెందిన కళాభారతి కళాకారుల సంఘం మెరుగైన చికిత్స నిమిత్తం రూ.1.11 లక్షల నగదును గురువారం బాధితుడికి అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పిలక సోమేష్ చంద్ర, తలగాన కృష్ణారావు, కె.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, ఎవరైనా ఊర్లకు వెళితే బంగారం, వెండి తదితర విలువైన వస్తువులు సురక్షితమైన చోట భద్రపర్చుకోవాలని సీఐ మీసాల చిన్నమ నాయుడు కోరారు. ముఖ్యంగా చైన్‌స్నాచర్స్ ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంగారు నగలు మెరుగు పెడతామని చెప్పిన వారి మాటలు వినొద్దని, అటువంటి వ్యక్తులు ఎవరైనా తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంక్‌ల్లో నగదు డ్రా చేసిన తర్వాత బైక్ డిక్కీలో ఉంచొద్దని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండా లన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయండి

ఇచ్ఛాపురం: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ కాంట్రాక్టర్లకు సూచించారు. 16వ వార్డు పకీరుపేటలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఏఈ, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు

రేపు మహా చండీయాగం

సోంపేట: ఎకువూరు గ్రామంలో శనివారం మహా చండీయాగం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్ద బడే ఈశ్వరరావు తెలిపారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా యాగం చేస్తున్నట్లు, భక్తులు హాజరుకావాలని కోరారు.

ఉత్సవాలు విజయవంతం కావడం ఆనందంగా ఉంది

● మంత్రి అచ్చెన్నాయుడు



భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి జాతర రాష్ట్ర పండుగగా తొలిసారి దిగ్విజయంగా నిర్వహించుకున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉత్సవాల నేపథ్యంలో చివరిరోజు గురువారం బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి శతజయంతి, అదే సమయంలో ఉత్సవాలు నిర్వహించుకోవడంతో తల్లి ఆశీస్సులు మనందరిపై ఉన్నాయని, ఇందుకు వరుణుడు కూడా కరుణించడం ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించి, భక్తులకు ప్రసాదం వడ్డించి ఆయన కూడా స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బోయిన రమేష్, గోవిందరాజులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కొత్తమ్మతల్లిని జనసేన జిల్లా నాయకుడు డా.దానేటి శ్రీధర్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో వి.రాధాకృష్ణ, పురోహితుడు గణపతి శర్మ, జనసేన జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వర రావు, పార్టీ మండల అధ్యక్షుడు పాగోటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● కొత్తమ్మ తల్లి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కోటబొమ్మాళి డీసీసీబీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ఉషా శాంతి, సూపర్‌వైజర్ జి.రవిచంద్ర ప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనీలమణి దుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీనీలమణిదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు విశేష హోమాలు, పూజలు చేపట్టారు. అమ్మవారి బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవరాత్రుల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఈవో వాసుదేవరావుకు సూచించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు సైల బాబ్జీ, సైలాడ సతీష్, నాయకులు మద్దు రామారావు, అక్కంధ్ర సన్యాశి, పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



ఎల్.ఎన్.పేట: మండలానికి కేటాయించబడిన అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్‌గా జె.ఈశ్వరమ్మ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇప్పటి వరకు పనిచేసిన వైవీ పద్మావతి బూర్జకు బదిలీ కాగా అక్కడి నుంచి ఈశ్వరమ్మ ఇక్కడికి వచ్చారు.

ఎంపీడీవోగా శ్రీనివాసరావు



ఎంపీడీవోగా పైడి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటి వరకు పనిచేసిన ఆర్.కాళీ ప్రసాదరావు హిరమండలానికి బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అధికారులను సిబ్బంది అభినందించారు.

తహసీల్దార్‌గా రవీంద్రబాబు



రవీంద్రబాబును అభినందిస్తున్న టీడీపీ నేతలు

హిరమండలం: తహసీల్దారుగా కె.రవీంద్రబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయనకు జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, టీడీపీ నాయకులు యాళ్ల నాగేశ్వరరావు, గోళ్ల సింహాచలం, ఎస్.గోవిందరావు, తేజ మర్యాదపూర్వకంగా కలిసి అభినం దించారు.

ఎంపీడీవోగా చంద్రకుమారి



పాతపట్నం: ఎంపీడీవోగా పి.చంద్రకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె మెళియాపుట్టి నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న పేడాడ జయంత్ ప్రసాద్ సంతబొమ్మాళికి బదిలీ అయ్యారు.

ఎంపీడీవోగా సూర్యనారాయణ



మందస: ఎంపీడీవోగా పైల సూర్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. కవిటి నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన తిరుమల రావు కంచిలికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సూర్యనారాయణకు కార్యాలయం సిబ్బంది, అధికారులు స్వాగతం పలికారు.

మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసిన 'వజ్జ'



పలాస: రాష్ట్ర ట్రేడ్ ప్రమోహన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు గురువారం మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నా యుడు, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, జి.శంకర్, బెందాళం అశోక్‌తో పాటు మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీలను కలుసుకున్నారు. తనకు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన తరువాత వారిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తెగుళ్లు సోకిన పొలాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జలుమూరు: జోనంకిలో వరి చేనును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నరసన్నపేట/జలుమూరు: నరసన్నపేట, జలుమూరు మండలాల్లో వరికి సోకిన తెగుళ్లను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'వరికి తెగుళ్ల పోటు' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త ఉదయ్‌బాబు, ఏడీఏ రవీంద్రభారతి, ఏవోలు సునీత, సురేష్ తదితరులు నరసన్నపేట మండలం కోమర్తి, జలుమూరు మండలం జోనంకిలో వరి పైరును పరిశీలించారు. తెగుళ్లు సోకిన వెంటనే రైతులు వ్యవసాయాధికారుల సలహాలను తీసుకోవాలన్నారు. వరి దుబ్బు మొదలు తడిసేలా పురుగుల మందు పిచికారీ చేసి సుడిదోమను నివారించవచ్చన్నారు. వరిలో కేళీలు వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పొలంబడి నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

హరిపురం: మందస మండలం బాలిగాం మార్గంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. వీరభద్ర గ్రామానికి చెందిన ట్రాక్టర్‌తో తాళ్లగురంటి గ్రామం సమీపంలోని మహేంద్ర తనయ నదినుంచి ఇసుకను తరలిస్తుండగా వాహనాల తనిఖీలో ఆపి విచారించగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ఖాదర్‌బాషా తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

టెక్కలి: రావివలసలోని 11కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో తెంబూరు రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, గ్యాస్ గొడౌన్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మెళియాపుట్టి సబ్‌స్టేషన్ పరిధిలో..

మెళియాపుట్టి: మెళియాపుట్టి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మెళియాపుట్టి, చాపర, వెంకటాపురం, జాడుపల్లి తదితర గ్రామాల పరిధిలో విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పాతపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం 132-33 కేవీ సబ్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతపట్నం బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగదల, గోపాలపురం, సీతారాంపల్లి, చంగుడి, సరాళి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హరిపురంలో..

మందస: మందస మండలం హరిపురం 33/11 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ యోగి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హరిపురం, నారాయణపురం, మఖరజోల, అంబుగాం, బేతాళపురం, రట్టి, బిడిమి, గంగువాడ, లోహరిబంద, నల్లబొడ్లూరు గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.